## ఉత్సవాలకు ఎంపి ఈటల రాజేందర్‌కు ఆహ్వానం



ఈటెల రాజేందర్‌కు ఆహ్వాన పత్రిక అందచేస్తున్న దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహారాజ్

**ఝరాసంగం, అక్టోబరు 8, ప్రభాతవార్త:** దత్తగిరి ఆశ్రమంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు హాజరు కావాలని మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవదూత గిరి మహారాజ్ (అప్పగారు) మల్కాజిగిరి బిజెపి ఎంపి ఈటెల రాజేందర్‌ను ఆహ్వానించారు. మంగళవారం హైద్రాబాద్‌లోని ఈటెల రాజేందర్ నివాసానికి అప్పగారు చేరుకుని ఎంపికి ఆహ్వాన పత్రికను అందచేశారు. ఉత్సవాలు ఎంపి హాజరుకానున్నట్లు అప్పగారు పేర్కొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## వెల్దుర్తిలో దొంగల హల్‌చల్..

**వెల్దుర్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మంగలి సాయికుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం, బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, ఇరవై తులాల వెండి, నాలుగు వేల నగదును దొంగలించారని స్థానిక ఎస్‌ఐ రాజు తెలిపారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన అన్నారు. కాగా మంగళవారం దొంగతనం జరిగిన ఇంటిని ఎస్‌ఐ రాజు పరిశీలించారు



ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న వెల్దుర్తి ఎస్‌ఐ



మాజీ మంత్రి హరీష్‌రావుతో మాట్లాడుతున్న ఆశా కార్యకర్తలు

## ఆశావర్కర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులందరికీ ప్రతి నెల 1వ తేదీన జీతాలు ఇస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి..సీఎం సీటులో కూర్చున్న తర్వాత ఆ మాటలను మర్చిపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో మంగళ వారం ఆశా కార్యకర్తలు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును కలిసి తమగోడును విన్నవించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ 1వ తేదీకి రావాల్సిన జీతాలు 8వ తేదీనా ఇవ్వకపోవడం సరికాదన్నారు. తెలంగాణలో అడపడుచులు ఎంతో ఘనంగా జరుపుకునే బతుకమ్మ, దసరా పండుగ పూట ఆశా కార్యకర్తలకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిలో, సంక్షేమంలో తమ వంతు కృషి చేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పండుగపూట అడబిడ్డలను కంటతడి పెట్టించకుండా.. వెంటనే ఆశా వర్కర్లకు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డేటా ఎంట్రీల్లో సక్రమంగా పేర్లు నమోదు చేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఎంట్రీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

**నర్సాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** ఫ్యామిలీ డిజిటల్‌కార్డు డేటా ఎంట్రీలో ఎటువంటి పొరపాట్లు జరుగవద్దని డేటా ఎంట్రీల్లో సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ కార్డు డేటా ఎంట్రీ నమోదును ఆయన పరిశీలించారు. కుటుంబాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో స్వయంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు డేటా ఎంట్రీలో నమోదు చేయడంలో ఎటువంటి పొరపాట్లు రాకుండా సక్రమంగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డును, మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామాన్ని ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రక్రియను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు, కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాస్, కౌడిపల్లి మండల తహసీల్దార్ ఆంజజనేయులు, ఎంపిడివోలు మధులత, నాగేశ్వర్‌రావు, మున్సిఫల్ మేనేజర్ మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## నాయిని చెరువులో ఆకాశం అందాలు

### -వీక్షించి తన్మయం చెందిన ప్రకృతి ప్రేమికులు

**చౌటకూరు, అక్టోబరు 8, ప్రభాతవార్త:** ఊహకు అందని ఆనందాలు చిగురిస్తున్న ఈ నేలలో, ఊపిరి కూడా ఊయలై విహరిస్తున్న ఈ కాలంలో మనసు కోరే మరో లోకం చూడలనిపిస్తున్న ఈ వేళలో ప్రకృతి కన్నా గొప్పది ఈ ధరణిలో లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. ప్రకృతి ఇచ్చే సవ్వడి, చెట్లు ఇచ్చే గాలి మనసు ఇచ్చే ఆనందం, ఆనుభవం ఇచ్చే ఆప్యాయత ఎంతో విలువైంది. అలాంటి కమనీయ దృశ్యం మండల కేంద్రమైన చౌటకూరులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామ శివారులోని నాయిని చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నిండు కుండలా మారిపోయింది. చెరువు వరద నీటితో నిండిపోవడంతో రైతులు ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. ఇదిలా ఉంటే మంగళవారం సాయంత్రం ఆకాశంలోని అందాలు నాయిని చెరువులో ప్రత్యక్షం (కానరావడంతో) కావడంతో అటుగా వచ్చిన ప్రజలు ప్రకృతి అందాలను నీటిలో వీక్షించి తన్మయం చెందడంతోపాటు ప్రకృతి అందాల వివరాలను గ్రామస్థులకు, ప్రకృతి పేమికులకు, తమ సన్నిహితులకు ఫోన్‌ల ద్వార తెలపడంతో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు చెరువు వద్దకు చేరుకుని నీటిలో తేలియాడుతున్న ఆకాశ అందాలను వీక్షించి తన్మయం చెందారు. చెరువు నీటిలో ఆకాశం నుంచి ఏర్పడిన మేఘాల విభిన్న ఆకృతులు ప్రజల మదిని కట్టిపడేశాయి. ప్రభాతవార్త చెరవులో కానవచ్చిన అందాలను తన సెల్‌ఫోన్‌లో బందీ చేసుకుంది. చెరువులో ఆకాశ అందాలు, చెట్లపై పక్షుల కిలకిల చప్పుళ్లు చూస్తూ వింటూ ఉంటే చెరువు గట్టుపైనే సేదతీరాలని పిస్తోందని ప్రకృతి ప్రేమికులు చర్చించుకోవడం కానవచ్చింది.



నాయిని చెరువులో ఆకాశం అందాలు ప్రతిభింబిస్తున్న దృశ్యం

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు ప్రతీక 'బతుకమ్మ'

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**
**నేడు కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఉత్సవాలు**

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 8 ప్రభాతవార్త:**

బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, ఈ సంబరాలను కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ సందర్భంగా, అలాగే జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిరా, సంబంధిత ఇతర శాఖల అధికారులతో కలిసి సమీక్షించి సమర్ధ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ పండుగ జరుపుకుంటారని, వారి సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లుచేయాలన్నారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద లైటింగ్, తాగెనీటి సౌకర్యం, సౌండ్ సిస్టం, బతుకమ్మ జరిగే అన్నిప్రాంతాల్లో మౌలిక సదుపాయాలతో పాటు చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలని, ప్రతి మండలంలో బతుకమ్మ సంబరాలను విజయవంతంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డీఆర్‌డీవో, మెప్మా ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో సంప్రదాయ వంటకాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో మెదక్ స్టేడియం నుండి రాందాస్ చౌరాస్తా వరకు 2 కే రన్ నిర్వహించనున్నట్లు వివరించారు. బతుకమ్మ ఆడిన తరువాత చెరువుల్లో నిమజ్జనం చేస్తారని, నిమజ్జన ఘాట్ల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాట్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు నీళ్లలోకి దిగకుండా భద్రతపై పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పోలీసులతో పటిష్ట బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య ఆరోగ్యశాఖద్వారా వైద్య అంబులెన్స్, ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ సంప్రదాయం, సాంస్కృతి ప్రతిబించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుటకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు భారీ వాహనాలు ప్రధాన రహదారిపైకి రాకుండా మళ్లించడం పోలీస్ యంత్రాంగం తరపున పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

# పది నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం

**మెదక్ ఎంపి రఘునందన్‌రావు**

**జగదేవ్‌పూర్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):**

రాష్ట్రంలో పది సంవత్సరాలకాలంపాటు పాలన కొనసాగించిన బిఆర్‌ఎస్ పార్టీ ప్రజలలో విశ్వాసం కోల్పోయి బదనాం అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పది నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయి బదనాం పాలైందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు అన్నారు. జగదేవ్‌పూర్‌లోని ఎస్‌వి ఫంక్షన్‌హాల్‌లో బిజెపి మండల అధ్యక్షుడు దాసరి ఐలయ్యయాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మెదక్ ఎంపి రఘునందన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతికార్యకర్త కష్టపడి తనను గెలిపించారని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఎన్నికలప్పుడు బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ చూపిన మద్యం, డబ్బులకు ఆశపడకుండా తమ వ్యక్తిత్వాన్ని, నరేంద్రమోడి నాయకత్వాన్ని చూసి మెదక్‌లో బిజెపిని గెలిపించారని అన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో విసుగు చెందిన ప్రజలు బిజెపివైపు చూస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎంపిపి, జెడ్‌పిటిసి స్థాయివరకు బిజెపి గెలుపొందాలన్నారు. బిఆర్‌ఎస్ పార్టీకి 32 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ప్రతిపక్షంలో కూర్చోబెడితే పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ ఏ ఒక్కనాడు ప్రజల పక్షాన కొట్లాడటంలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ బొమ్మ అయితే బిఆర్‌ఎస్ పార్టీ బొరుసు అని ఎద్దేవ చేశారు. బిజెపి బూత్ అధ్యక్షులు వందకుపైగా సభ్యత్వాలు చేపించినట్లయితేనే స్థానిక ఎన్నికల్లో పార్టీ బిఫాంలు దక్కుతాయని, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రపంచంలోకెల్లా ఎక్కువ కార్యకర్తల బలమున్న పార్టీ బిజెపి అని, ప్రపంచశాంతికి మోడి నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయని తెలిపారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు ఐలయ్యయాదవ్ మాట్లాడుతూ బిజెపిలో ప్రస్తుతం ఎక్కువ మంది యువకులే ఉన్నారని, ఇప్పుడిప్పుడే సీనియర్ నాయకులు బిజెపిలో చేరుతున్నారని, ఇది పార్టీ పటిష్టతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అందరినీ కలుపుకొని మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.

**బిజెపిలో చేరిన బిఆర్‌ఎస్ నాయకులు**

అంతకుముందు జగదేవ్‌పూర్ మాజీ సర్పంచ్ బుద్ద జ్యోతి మహేందర్, చాట్లపల్లి బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ తనయుడు జంబుల దేశాయ్‌రెడ్డితోపాటు పలువురు కార్యకర్తలు బిజెపిలో చేరగా వారికి రఘునందన్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గురువారెడ్డి, కుడిక్యాల రాములు, కప్పర ప్రసాద్‌రావు, యెల్లు రాంరెడ్డి, కోదండం శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం శ్రీధర్, చంద స్వామి, రాజ్‌కుమార్, నర్ర నర్సింలు, చాట్లపల్లి నాయకులు బండారు మల్లేశం, పాములపర్తి మహిపాల్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

## ప్రకృతిలో లభించే ఆకులు, పూలతో పూజించే పండగ బతుకమ్మ పండగ : హరీష్‌రావు సతీమణి శ్రీనిత

**చిన్నకోడూరు, అక్టోబరు 8, ప్రభాతవార్త :**

ప్రకృతిలో లభించే ఆకులు, పూలతో పూజించే పండగ బతుకమన పండగ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సతీమణి శ్రీనిత, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వేలేటి రోజాశర్మలు అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలలో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణలో జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. సద్దుల బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరొక్క పూలతో మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చినట్లు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు మహిళలు ఎంతో విలువ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరులో సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని బతుకమ్మ ఆడుతున్న శ్రీనిత

# ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు లేకుండా చూడాలి

**మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

**మెదక్ రూరల్, అక్టోబరు 8 ప్రభాతవార్త:**

వానాకాలం 2024-25 సీజన్ ధాన్యం (సన్న రకం, దొడ్డురకం) కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వానాకాలం 2024-25 సీజన్ వరి ధాన్యం (సన్న రకం, దొడ్డు రకం) కొనుగోళ్లపై ఏఈవోలు, డీపీఎంలు, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాక్స్, ఐకేపీ, మార్కెటింగ్ శాఖల ద్వారా 463 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఐకేపీల ద్వారా 160 కొనుగోలు కేంద్రాలు, ప్యాక్స్ ద్వారా 284, డీఎం సివిల్ సప్లై ద్వారా 07, ఎఫ్‌పీవోల ద్వారా 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు 93 ఏర్పాటు చేయగా, దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలు 370 ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా సన్న రకం ధాన్యంపై రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బోనస్ 48 గంటల్లో రైతుల అకౌంట్‌లలోకి జమ అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకానికి వేరువేరుగా రికార్డులను సరైన విధంగా నిర్వహించాలని, మూమెంట్ ప్లాన్ రిజిష్టర్‌లను సన్న, దొడ్డు రకానికి వేరుగా నిర్వహించాలన్నారు. ఈ రిజిష్టర్‌లలో రైతు పేరు, ఫోన్ నెంబర్, సమయం, స్థలం, రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి కేంద్రానికి దొడ్డు రకానికి ఒఎన్ (ఇ-కోర్సు) 1, 2, 3, 4.. అని, సన్న రకానికి ఒఎన్ (ఎస్-సన్నాలు) 1, 2, 3, 4.. అని ఇలా కోడ్‌ను కేటాయించామన్నారు. ఈ కోడ్‌ను ప్రతి ధాన్యం బస్తాపై ఉండాలని, దీనిని ప్రతి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా పాటించాలని, దొడ్డు రకానికి పచ్చదారం, సన్న రకానికి ఎర్ర దారం ఉండాలని, ఏఈవోలు ప్రతి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలన్నారు. ఈ రెండు రకాల ధాన్యం తరలింపుకు వేరువేరుగా రవాణా సౌకర్యం కల్పించాలని, ధాన్యం తేమ శాతం 17 ఉండాలని, వానల పట్ల అప్రమత్తంగా ఉంటూ రైతులకు ముందుస్తు అవగాహన కల్పించాలన్నారు. సన్న బియ్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఓపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ వానాకాలం పంట కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏ కేంద్రంలో అయిన సన్నాలకు రూ. 500 బోనస్ పట్ల అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, డయల్ గ్రోయిన్ క్యాలిబర్‌లను, చెక్ పోస్టులు, టోకెన్‌ల జారీ, వేయింగ్ మెషీన్‌లు, ప్యాడీ క్లీనర్‌లు తదితరాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## పిఆర్‌టియు రాష్ట్ర కమిటీలో ఆరుగురికి చోటు

**మర్కుక్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులకు పిఆర్‌టియు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. మంగళవారం అంతాయిపల్లి శామీర్‌పేటలో రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పిఆర్‌టియు 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పాల్గొని 2024-26 సంవత్సరానికిగానూ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గంలో మర్కుక్ మండలం నుండి కొత్త నరేందర్‌రెడ్డి, జి.కూచిరెడ్డి, కె.నర్సింలు, నారెడ్డి రామకృష్ణారెడ్డి, ఎండి.షాబుద్దీన్, రజితరెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికకాగా ఉపాధ్యక్షులుగా ఏ.సరితాదేవి, యాదిరెడ్డి, యు.గణేష్, కె.శ్రీధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల అధ్యక్షుడు రేబల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్ మాట్లాడుతూ మర్కుక్ మండలానికి పెద్దపీట వేస్తూ ఐదు అసోసియేట్ పదవులు, నాలుగు ఉపాధ్యక్ష పదవులు రావడానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్‌శర్మలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు రమణారావు, వెంకటేశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 8 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో జరుగుతున్న 35వ రాష్ట్ర పీఆర్టీయూ కౌనిల్‌లో రెండవ రోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో మెదక్ పట్టణానికి చెందిన ఎల్. మల్లారెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా మూడోసారి ఎంపిక కావడం జరిగింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, మండల బాధ్యులకు, జిల్లా బాధ్యులకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, ఎమ్మెల్సీలకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇచ్చిన ఈ పదవి ఉపాధ్యాయులకు అన్ని రకాల సేవలు చేయడానికి ఉపయోపడుతుందని ఆయన అన్నారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ సమస్యల సాధనలో ముందుంటానని ఆయన అన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మల్లారెడ్డి ఎన్నికైనందున వారికి హవేళిఘనపూర్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు, మార్గం సిద్ధిరాములు, యాదవరెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

## పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర కౌన్సిల్ అసోసియేట్ అధ్యక్షుడిగా బాగారెడ్డి, హరిరంజన్ శర్మ

**వెల్దుర్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో జరుగుతున్న 35వ రాష్ట్ర పీఆర్టీయూ కౌన్సిల్ సమావేశంలో మాసాయిపేట మండలానికి చెందిన బాగన్నగారి బాగారెడ్డి, కాసుల హరిరంజన్‌శర్మలను పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా కార్యదర్శి దయాకర్, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీశైలం, బాలమణిలు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికైన బాగారెడ్డి, హరిరంజన్ శర్మలకు అభినందనలు తెలిపారు.

## డబ్బు కట్టి...డప్పు కొట్టు

### -పనిబాటల వారిపై ఆలయ ఈఓ చిర్రుబుర్రులు

#### -ఈఓ చంద్రశేఖర్‌పై మండిపడిన భక్తులు

**పాపన్నపేట, అక్టోబరు 8, ప్రభాతవార్త:** అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం పెట్టుబోతలు అడిగిన పనిబాటల వారిపై ఏడుపాయల ఆలయ ఈఓ చంద్రశేఖర్ చిర్రుబుర్రు మనడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం మంగళవారం ఏడుపాలయ వనదుర్గా భవాని మాత సన్నిదిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... ఏడుపాయల్లో ఏ పండుగలైనా అందులో 18 రకాల పనిబాటల వారు పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. పండగలు అయిపోయాక వారికి ఎంతో కొంత ఆలయం నుంచి డబ్బులు చెల్లిస్తారు. ఇందులో భాగంగా ఏడుపాయల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతుండటంతో మంగళవారం బోనాల తీసే కార్యక్రమం నిర్వహించగా కుమ్మరి వారు కుండలు, చాకలి వారు సున్నం వేయడం, డప్పు కొట్టే వారు డప్పుకొట్టడం ఇలా ఏ పనివారు ఆ పనులు పూర్తి చేసుకున్నారు. కార్యక్రమం అయిపోగానే తమ పెట్టుబోతల గురించి(డబ్బులు) ఈఓ కార్యాలయానికి వెళ్లి అడుగగా మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు అంటూ ఈఓ చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆచారం ప్రకారమే తాము ఇక్కడికి వచ్చామని పనిబాట వారు ఈఓకు వినతి చేసిన ప్రయోజనం లేకపోయింది. దేవుడికి సేవ చేసి డబ్బులు అడుగుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డప్పు కొట్టడానికి మొదలు కొన ప్రతి దానికి టెండర్ నిర్వహిస్తామని ఈఓ బెదిరంపు ధోరణకి దిగారు. తమతో గొడ్డుచాకిరి చేయించుకుని డబ్బులు ఎగొట్టడం ఏమిటని ఈఓతో పనిబాటల వారు వాగ్విదానికి దిగారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ ఈఓ తీరుపై మండిపడుతున్నారు.

## ఎజిపి రఫీకి సన్మానం



ఎజిపిగా నియమితులైన రఫీయుద్దీన్ సన్మానిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, అక్టోబరు 8, ప్రభాతవార్త:** జిల్లా నాలుగు కోర్టులకు ఏజీపీగా నియామకమైన సీనియర్ న్యాయవాది ఎం.డి.రఫీయుద్దీన్‌ను ఐనాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు

**సిర్గాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మండలపరిధిలోని చిన్న ముబారక్ పూర్ లో గ్రామ పంచాయితీ భవనం నిర్మాణానికి ఎంజి ఎఆర్‌ఈజిఎస్ పథకంలో 20లక్షల రూపాయలను మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దసరా కానుకగా తమ గ్రామానికి పంచాయితీ భవన నిర్మాణానికి 20లక్షల రూపాయలు మంజూరు చేయించిన ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిలకు మాజీ సర్పంచ్, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

### రూ.60,270 నగదు,6 సెల్‌ఫోన్లు స్వాధీనం

**కొమురవెల్లి, అక్టోబరు 8, ప్రభాతవార్త :** కొమురవెల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని కొండపోచమ్మ గ్రామ శివారులోని జగ్గన్నగారి శంకర్‌గౌడ్ షెడ్‌లో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిద్ధిపేట టాస్క్‌ఫోర్స్, కొమురవెల్లి పోలీసులు మంగళవారం దాడిచేశారు. పేకాట స్థావరంలో రూ.60,270 నగదు, 6సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 11 మంది పేకాట ఆడుతుండగా అందులో వైరం రాజు గుండ్లపల్లి, వేముల కృష్ణ వీరారెడ్డిపల్లి, గంగాదేవి వెంకటేష్ గంగసానిపల్లి, గుగులోత్ వెంకటేష్ మల్కాపూర్, మహ్మద్ నిజామ్ కాశిరెడ్డిపల్లిలను అదుపులోకి తీసుకున్నారు. మండల స్వామి భవనందాపూర్, నక్కల నాగరాజు యాదగిరిగుట్ట, మునిగపడ భాను, మాచిరెడ్డి నర్మారెడ్డి నరసన్నపేట, వెంకటేశం భువనగిరిలు పరారైనట్లు పోలీసులు తెలిపారు.

## చందానగర్‌లో పిఆర్‌కె హాస్పిటల్ అక్రమ నిర్మాణంపై చర్యలేవి : కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

చందానగర్‌లో రోడ్డును కబ్జాచేసి,పార్కింగ్ స్థలం లేకుండా నిర్మించిన పీఆర్‌కే హాస్పిటల్ బహుళ అంతస్తుల నిర్మాణంపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని జనంకోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు చందానగర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. చందానగర్‌లో స్తానిక ప్రజలను తీవ్ర అసౌకర్యానికి, ట్రాఫిక్ ఇబ్బందులకు గురిచేస్తున్న పీఆర్‌కే హాస్పిటల్ బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఆర్‌కే హాస్పిటల్ యాజమానయం రోడ్డును కబ్జాచేసి ఉల్లంఘనలకు పాల్పడటమే కాకుండా రోడ్డుమీదనే అంబులెన్సలతో పాటు ఆసుపత్రి ఉద్యోగుల వాహనాలను కూడా రోడ్డుపైనే ఉంచటం, ఆసుపత్రి హైవేపైన ఉండటంతో పాటు మంజీరా రోడ్డులో కూడా అత్యంత రద్దీ పెరుగుతుందని, దీంతో ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ఈ విషయమై జనం



చందానగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న పీఆర్‌కే ఆసుపత్రి భవనసముదాయం

కోసం అనేకపర్యాయాలు చందానగర్ సర్కిల్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా,సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని అడిగినా ఏలాంటి చర్యలు తీసుకోలేదని, సమాచారం కూడా ఇవ్వలేదని ఆయన అన్నారు. పెద్దవారు చట్టవిరుద్ధంగా ఏ పనిచేసినా చందానగర్ సర్కిల్ అధికారులు మౌనం వహించటంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా పీఆర్‌కే హాస్పిటల్ చందానగర్



పీఆర్‌కే హాస్పిటల్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని డిప్యూటి కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కసిరెడ్డి భాస్కరరెడ్డి

అక్రమ నిర్మాణాన్ని, రోడ్డుకబ్జాలపై వెంటనే అధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు అసౌకర్యాన్ని దూరం చేయాలని, యుద్ధప్రాతిపదికన ఉన్నతాధికారులు స్పందించాలని జనంకోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు.

### యాకుత్‌పుర నియోజకవర్గంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు



శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలలో పాల్గొన్న భక్తులు

**చార్మినార్,అక్టోబరు 8 ప్రభాతవార్త :**

యాకుత్‌పుర నియోజకవర్గంలో గత వారం రోజుల నుంచి అత్యంత వైభవంగా శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు జరుగుతున్నాయి.గౌలిపుర,బేలా,సైదాబాద్,మాదన్నపేట్,సుల్తాన్ షాహితో పాటు పలు ప్రాంతాలలో నిర్వాహకులు శ్రీ దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు, హోమాలు జరుపుతున్నారు.మండపాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.సుల్తాన్‌షాహిలో శ్రీ జగదాంబ దేవాలయం కమిటి అధ్యక్షులు రాకేష్ తివారీ ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ప్రతీ రోజు చండీ హోమాలు నిర్వహిస్తున్నారు.శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

### మిఠాయిలు పంపిణీ చేసిన బిజెపి నాయకులు

**చార్మినార్,అక్టోబరు 8 ప్రభాతవార్త :** హర్యానాలో బిజెపి మూడవ సారి అధికారంలోకి వచ్చిన సందర్బంగా సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు చార్మినార్ నియోజకవర్గం దారుషిఫా ప్రాంతంలో సంబురాలు నిర్వహించారు.ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గోల్కొంజ జిల్లా బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్,బిజెపి నాయకులు సయ్యద్ బిన్ అలీ గుత్మి,వ జాహత్ హుస్సేన్,రవి గౌడ్,ఆర్.ఓడేల్,రాష్ట్ర బిజెపి మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.

### విజయదశమి వేడుకలకు ఏర్పాట్లు చేయాలని వినతి




కార్వాన్-13 సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

**మెహిదీపట్నం, అక్టోబర్ 08, ప్రభాతవార్త :**

లంగర్‌హౌస్ డివిజన్ బాపూఘాట్‌లో ఈనెల 12న జరగనున్న విజయదశమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ మంగళవారం దసరా ఉత్సవసమితి అధ్యక్షులు బోగి బాలరాజ్ ఆధ్వర్యంలో కార్వాన్-13 సర్కిల్ డిప్యూటీ కమీషనర్ శశిరేఖకు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా రాంలీల మైదానంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని హమీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో మాజిద్, నవీన్‌లు ఉన్నారు.

## గొప్ప పుస్తకం "సుప్రభాత భావనలు'

**-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి**



పొత్తూరి సుబ్బారావు రచించిన పదమూడవ పుస్తకం 'సుప్రభాత భావనలు'ను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:**

నిండైన పండినటువంటి పుస్తకం 'సుప్రభాత భావనలు' అని పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. జీవిఆర్ ఫౌండేషన్, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో పొత్తూరి సుబ్బారావు రచించిన పదమూడవ పుస్తకం 'సుప్రభాత భావనలు'(వ్యాసాలు' ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ఈ పుస్తకాన్ని పెద్దూరి వెంకటదాసుకు అంకితమిచ్చారు. కవి, రచయిత, విమర్శకులు రమణ వెలమకన్ని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, సాహితీవేత్త డాక్టర్ వై.రామకృష్ణారావు, జీవిఆర్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి బివి.రాఘవరెడ్డి, సాహిత్యాభిమాని పివిఎల్.నరసింహారావు, సాహితీకిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి, సాహితీవవేత్త డాక్టర్ పి.లలితవాణి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'విజయీభవ' అంశంపై కవిసమ్మేళనంలో కవులు, రచయిత్రులు తమ అమూల్యమైన కవితలను వినిపించారు.

## కనకదుర్గ నృత్యవిభావరిలో కనువిందుగా నవరాత్రి వేడుకలు



కళాప్రదర్శనల్లో చిన్నారి కళాకారులు

**నాంపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త :**

దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదవరోజు అమ్మవారి శ్రీ బాలత్రిపురసుందరి అవతారాన్ని పురస్కరించుకొని కనకదుర్గ నృత్యవిభావరి ఆధ్వర్యంలో సంస్థ అధినేత్రి డా. లయన్ నిర్మలా ప్రభాకర్ నిర్వహణలో శిష్యబృందంచే లలిత సహస్రనామ పారాయణం, దుర్గస్తుతి, వినాకయ స్తుతి, లింగాష్టకం, అన్నమయ్య కీర్తనలు, శివతాండం నృత్యాలు, కీర్తనల ఆలాపన నయనమనోహరంగా ప్రదర్శింపబడ్డాయి. చిన్నారి కళాకారులు సహస్ర, రితిక, లత, పూర్వి, తేజ్‌నిధి, కృతిక, అస్మిత, సతాక్షి, పూర్ణిమ, పూర్విక, దీక్ష, అధ్యా, అక్షిత, మౌనిక, స్వాప్నిక, అద్వైత, తేజశ్రీ, కనిష్క, స్రవంతి, భాగ్యపద్మ, అశ్విని, సరిత తదితరులు పాల్గొనగా వాద్యసహకారం గాత్రం వెంపటి శ్రీవల్లీశర్మ, మృదంగం శ్రీధరాచార్య, పూజ తదితరులు అద్భుతంగా అందించి ప్రదర్శనలను మరింత రక్తికట్టించారు. చివరి ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారి శిష్యులు తమ గురువు నిర్మల ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించుకుని గురువందనం కావించారు.

## నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి : ఎమ్మెల్యే

**నార్సింగి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం గండిపేట మండలం కిస్మత్‌పూర్ గ్రామంలో గండిపేట మండల విద్యాధికారి కార్యాలయం(ఎంఇఒ)ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట మండలంకు ప్రత్యేకంగా ఓ విద్యాధికారి(ఎంఇఒ)ను నియమించడం, ఓ కార్యాలయంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ బడులలో మెరుగైన విద్యను అందించాలన్న ఉద్దేశంతోనే తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖను విస్తరిస్తుందని, ఆధునీకరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను సైతం త్వరలోనే భర్తీ చేయడం జరుగుతుందని, ఇక అధ్యాపకులు మరింత బాధ్యతగా విద్యార్థులకు పాఠాలు బోధించాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో విద్య అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక నూతన సంస్కరణలు తీసుకు వస్తున్నారని తెలిపారు. నిరుపేదలు, దినసరి కూలీలు చదువుకుంటున్న ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య అందిస్తే భవిష్యత్తులో పేదల ఇళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు పుట్టుకు వస్తారని తెలిపారు. ప్రభుత్వ బడులలోనే ఒత్తిడిలేని చదువులు అందుతున్నాయని, ప్రైవేటు



కిస్మత్‌పూర్‌లో ఎంఇఒ కార్యాలయంను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

విద్యాలయాల్లో ర్యాంకులు సాధించాలని విద్యార్థులపై ఒత్తిడిని పెడుతున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ఆంగ్లమాధ్యమంలో చదువులు అందుతున్నాయని ఇది పేద విద్యార్థులకు శుభపరిణామం అని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ విజయ్ కుమార్, మేయర్ లతా ప్రేమ్‌గౌడ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నేత సురేష్‌గౌడ్, వివిధ పాఠశాలలకు చెందిన అధ్యాపకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారి మండపాలను దర్శించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

దేవి నవరాత్రులలో భాగంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌లలో పలు దేవి మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమీర్‌పేట డివిజన్‌లోని బిటైప్ క్వార్టర్స్ లో స్థానిక కాలనీ వాసుల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నిర్వాహకులు గౌతం, స్టీవెన్, శ్రీకాంత్, రమణ, రమేష్, ప్రసన్న, హన్మంతరావు, అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహా, గోపిలాల్ చౌహాన్, బలరాం, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**సనత్‌నగర్ డివిజన్‌లో..**

సనత్‌నగర్ డివిజన్‌లో పలు ప్రాంతాలలో ఏర్పాటుు చేసిన దుర్గామాత మండపాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా 60 ఫీట్ రోడ్డులో ఫలహారం బండి మధు ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం సుభాష్ నగర్, ఎస్ఆర్‌టిలోని భగత్‌సింగ్ గ్రౌండ్‌లో, ఆర్‌సి పేటల్ ఆధ్వర్యంలో, తులసీనగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయం, సుందర్‌నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, సియాష్‌గుప్తా, రాజేష్ పాల్గొన్నారు.

### చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చేపూరి లక్ష్మణ్

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. చిక్కడపల్లి సంఘం భవన సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా చేపూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారిగా తొడుపునూరి రవీందర్ ఇతర సభ్యులు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు ప్రమాణస్వీకారం చేసిన వారిలలో ఉన్నారు. సంఘం పూర్వ అధ్యక్షుడు సింగారపు రమేశ్ నూతనంగా ఎంపికైన వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఏర్పడి 32 సంవత్సరాలైందని, ప్రతి నెలా అన్నదాన కార్యక్రమం, తదితర సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

### గాంధీనగర్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



కరపత్రాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన బతుకమ్మ సంబురాలకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం డివిజన్ బిజెపి మహిళామోర్చ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. 9న ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో సాయంత్రం ఈ వేడుకలు జరుగుతాయని నాయకులు విజయలక్ష్మి, సంధ్యారాణి, స్వప్న, పూర్ణ, సంయుక్త రాణి, కృష్ణవేణి వివరించారు. డివిజన్ మహిళలతోపాటు నియోజకవర్గంలోని మహిళలందరు ఈ కార్యక్రమంలోపెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

## మదర్ డైరీ డైరెక్టర్‌గా జంగయ్య ప్రమాణ స్వీకారం



మదర్‌డైరీ డైరెక్టర్‌గా ఎన్నికైన జంగయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,రామకృష్ణ ,బుచ్చి రెడ్డి,యాదయ్య

**యాచారం అక్టోబరు8,ప్రభాతవార్త :** యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన మండలి జంగయ్య నల్గొండ రంగారెడ్డి జిల్లాల మదర్‌డైరీ డైరెక్టర్‌గా ఎన్నికైనా సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు.మదర్ డైరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ,స్థానిక నాయకులతో పాటు మండలి జంగయ్య చేరుకొని నూతన డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ...తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ పెద్దలకు ఎమ్మెల్యేకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.నమ్మకంతో పనిచేస్తూ పాడి రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

### ట్రాఫిక్ నియంత్రణకు పెద్ద షాపూర్‌లో బారికేడ్లు ఏర్పాటు



**శంషాబాద్ అక్టోబరు8,ప్రభాతవార్త :** పెద్ద షాపూర్ గ్రామంలో ఇటీవల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా పెరిగిపోవడంతో భారీ వాహనాల సంచారంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.వాహనాలు విపరీతమైన స్పీడ్‌తో వెళ్లడం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి .దీనిని దృష్టిలో ఉంచుకొని పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ ముదిరాజ్ లిమ్స్ ఆస్పత్రి యజమాన్యాన్ని కలిసి బారికేడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఆయన అభ్యర్థన మేరకు లిమ్స్ హాస్పిటల్ నుండి డాక్టర్ రామరాజు వెహికల్ స్పీడ్ నియంత్రణకై నాలుగు బార్కేడ్లు పెద్దషాపూర్ గ్రామానికి అందజేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ ముదిరాజ్ లిమ్స్ ఆసుపత్రి ఎండి డాక్టర్ రామరాజుని ఘనంగా శాలువా పూలమాలలతో సన్మానించి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ జితేందర్ రెడ్డి ,కారోబార్ రాజి రెడ్డి,స్థానికులు సురేష్ నాయక్,శివ,పవన్,శ్రీకాంత్,చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మావారికి పూజలు

**అత్తాపూర్ అక్టోబరు8,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు జిల్లా బిజెపి ఓబిసి సెక్రటరి నెల్లుట్ల జగన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమానికి అతిథిగా జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ,పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,రాజేంద్రనగర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్,అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ ,రాజేంద్రనగర్ బిజెపి జనరల్ సెక్రటరీ వేణు,కిషోర్,నెల్లుట్ల నవీన్ హాజరై అమ్మావారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం అతిథులను శాలువాతో జగన్ ఘనంగా సన్మానించారు.

### హిందువుల మనోభావులు దెబ్బతిసేలా గోడ నిర్మాణం

**-వెంటనే తొలగించాలని బిజెపి నేతల డిమాండ్**



**అత్తాపూర్ అక్టోబరు8,ప్రభాతవార్త :**

హిందువుల మనోభావుల దెబ్బతిసేలా కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు శివరాంపల్లి వికర్సెక్షన్ కాలనీ శివాలయానికి వెళ్లకుండా అడ్డంగా గోడ నిర్మించడం సరికాదని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు.మంగళవారం గోడలను తొలగించాలని కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు బిజెపి నాయకులు హాజరై మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కాలనికి అనుకుని ఉన్న శివాలయం ప్రతినిత్యం భక్తులు పూజలు చేస్తూ ఉండేవారని కావాలనే దేవీ నవరాత్రులు సమయంలో విశ్వవిద్యాలయం విసి నిరంజన్ ప్రభాకర్ ఉద్దేశపూర్వకంగా అడ్డంగా గోడ నిర్మించారని వాపోయారు.అనేక మందిరాలు యూనివర్సిటిలో ఉన్నాయని వాటిలన్నింటిలో గతంలో మాట్లాడి దేవాలయాలు అభివృద్ధి చేసుకున్నామన్నారు.ఇప్పుడు విసి కావాలని హిందువుల మనోభావాలకు అటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.వెంటనే విసి ఆ గోడ తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ,వై.శ్రీధర్ బాబు రావు,బొక్క బాల్ రెడ్డి,మల్లేష్ యాదవ్,సోల్కర్ రెడ్డి,సత్యనారాయణ ముదిరాజ్,రవి విజయ్ ,అత్తాపూర్ బిజెపి ప్రెసిడెంట్ జగన్ బాలకృష్ణ,పద్మావతి శీను,రజనీకాంత్ మల్లేచారి రాకేష్ గౌడన,వికర్ సెక్షన్ కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

### హర్యానాలో బిజెపి విజయంతో సంబురాలు

**అత్తాపూర్ అక్టోబరు8,ప్రభాతవార్త :** హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించి హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా హైదర్‌గూడ బిజెపి కార్యాలయంలో అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సాబాద విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకొని విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన చేవెళ్ల పార్లమెంట్ బిజెపి కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ...రాబోయే మహారాష్ట్ర ,జార్ఖండ్,ఢీల్లిలో అన్ని రాష్ట్రలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి ఇదేవిధంగా విజయకేతనం ఎగురువేయడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ,సభ్యత్వ కో కన్వీనర్ మోంద్ర కొమురయ్య,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్,రంగారెడ్డి జిల్లా ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బీట్కూరి సిద్దేశ్వర్,డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్ ,బూత్ అధ్యక్షుడు బీట్కూరి సతీష్,ఉమా శంకర్,గొల్ల అనిల్,నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

### మంగళగౌరిదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం



పూజలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు మంగళగౌరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అయం ఈవో మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీ పతిశర్మ నేతృత్వంలో జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణల చేశారు. కాగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంతో దర్శనమిస్తారు. కాగా ఉదయం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

### కళారత్న డాక్టర్ బిక్కికృష్ణకు అభినందన సత్కారం




కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ"ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవ సభ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్ అధ్యక్షతన, ఫౌండేషన్ కార్యదర్శి, కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ సమన్వయంలో జరిగిన ఈ సభలో బిక్కికృష్ణ రచించిన తెలుగు గజళ్ళు 'శిల్పసౌందర్యం', డాక్టర్ విజయలక్ష్మి పండిట్ రచించిన 'హృదయాంజలి', 'గజల్ షాయరీ' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాలను ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా బిక్కికృష్ణను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు టిడి.జనార్దన్ సత్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ పూర్వ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, రచయిత భగీరథ, ప్రముఖ రచయిత డాక్టర్ వీడీ.రాజగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, విమలసాహితీ సమితి అధినేత డాక్టర్ జల్లి విద్యాధరరావు, ప్రముఖ రచయిత డాక్టర్ బీరం సుందర్‌రావు, ఫౌండేషన్ సభ్యులు వూర శ్రీను, రాకేశ్, కుసుమ రాధా, ఎం.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ మెనింజైనిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** ప్రమాదకరమైన వ్యాధుల పిల్లలను తమ తల్లిదండ్రులు కాపాడుకోవాలని ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు, డాక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. వ్యాక్సిన్ ద్వారా నివారించగల ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగి ఉంటుందని, పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మంగళవారం ప్రపంచ మెనింజైనిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మెనింజైటిస్ వ్యాధి పట్ల అవగాహన అవసరమని, ఈ వ్యాధిని నిర్మూలించడానికి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్ళడం, సమస్యను ముందుగా గుర్తించడం, టీకా ద్వారా వ్యాధిని నివారించడం, తద్వారా ప్రాణాలను రక్షించే సామర్థ్యాన్ని ప్రోత్సహించడం కోసం కార్యక్రమం నిర్వహించడం విశేషమన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 2.5మిలియన్లకుపైగా మెనింజైటిస్ కేసులు నమోదవుతున్నాయని, ఇది తీవ్రమైన ఆరోగ్య సంక్షోభానిన్ని సూచిస్తోందని, ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో దాదాపు డెబ్బై శాతం మంది ఐదు సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు అని అన్నారు. ఈ వ్యాధి మెదడు, వెన్నుపాము చుట్టూ రక్షిత పొరల వాపు, సాధారణంగా బ్యాక్టీరియా, ఫంగల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధిబారినపడ్డ దేశాలలో భారతదేశం మొదటి మూడు దేశాలలో ఉందని, అక్యూట్ బ్యాక్టీరియల్ మెనింజైటిస్‌కు కారణమయ్యే మూడు వ్యాధికారకాలలో నీసేరియా, మెనింజైటిడిస్ ఒకటన్నారు. ఈ ప్రాణాంతక వ్యాధిని ఎదుర్కోవడానికి, ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపీ) మెనింగోకాకల్ వ్యాక్సిన్ ఇవ్వాలని, ఫలితంగా ప్రమాదం ఎక్కువగా ఉన్న 2 సంవత్సరాలకంటే ఎక్కువ వయస్సు వారికి ఒక డోస్‌గా సిఫార్సు చేయబడుతుందన్నారు.

### ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు హర్షణీయం

**-బిసి సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ**



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జకృష్ణ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:**

ఒకేక్యాంపస్‌లో ఎస్సీ,ఎస్టీ,బిసి మైనార్టీ విద్యార్థుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని బిసి సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ అన్నారు. ఈమేరకు మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో సుమారు 5వేలకోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభిస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రతినియోజకవర్గానికి ఒకస్కూల్ ఒక్కోస్కూల్‌కు 25కోట్లు కేటాయించడం 7నెలల్లో దాన్ని పూర్తిచేస్తామని ప్రకటించడం దేశానికే ఆదర్శమన్నారు. బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడాన్ని బిసి సంఘాలుగా స్వాగతిస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కోలాజనార్ధన్, నిరుద్యోగ జేఏసీ ఛైరనమన్ నీలవెంకటేష్, ప్రధాన కార్యదర్శి నందగోపాల్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లోని హైదర్షాకోట్ గ్రామంలో భూగర్భ డ్రైనేజి పనులను పరిశీలిస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర.



బోయిన్‌పల్లి మల్లికార్జున కాలనీ వైష్ణవిమాల్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి 14వ వార్షిక కార్యక్రమానికి హాజరైన విక్కి గుప్తా ఇతర సభ్యులు


రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో ఊడెం వేమారెడ్డి

## పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా వేమారెడ్డి

**గజ్వేల్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** పిఆర్‌టియు సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నికైన ఊడెం వేమారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఎన్ఆర్ గార్డెన్ అంతాయిపల్లి శామీర్‌పేట పరిధిలో జరిగిన పిఆర్‌టియు రాష్ట్ర ఎన్నికల్లో గజ్వేల్ మండలానికి చెందిన ఊడెం వేమారెడ్డిని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఊడెం వేమారెడ్డి మాట్లాడుతూ గత 28 సంవత్సరాల నుండి పిఆర్‌టియు సంఘానికి సేవలు అందిస్తున్నానని పేర్కొన్నారు. గతంలో పిఆర్‌టియు జిల్లా కౌన్సిలర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, గజ్వేల్ మండల అధ్యక్షుడిగా పదవులు స్వీకరించి సంఘం బలోపేతానికి కృషి చేసినట్లు గుర్తుచేశారు. పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మతో పాటు గజ్వేల్ మండల కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## దుర్గామాత అనుగ్రహంతో అందరూ బాగుండాలి

**-మున్సిపల్ చైర్మన్ రాజమౌళి**


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు

**గజ్వేల్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** దుర్గామాత అనుగ్రహంతో అందరూ బాగుండాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి పేర్కొన్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. అమ్మ దయ ఉంటే అంతా మంచే జరుగుతుందని తెలిపారు. శక్తివంతమైన ఈ పర్వదినాలలో శక్తిసంపన్నురాలైన శక్తి ఆదిపరాశక్తి జగన్మాత అమ్మవారిని దర్శించుకుంటే సంపూర్ణ అనుగ్రహం సిద్ధిస్తుందని తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అనసూయ దంపతుల ఆధ్వర్యంలో ఎన్.సి.రాజయ్య జ్ఞాపకార్థం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి.సంతోష్, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, సంతోషిమాత ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదులో పాల్గొన్న బిజెపి నాయకులు


బిజెపి జిల్లా అధ్యక్షునితో మనోహర్‌యాదవ్

**గజ్వేల్, అక్టోబరు 8(ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా బిజెపి పదాధికారులు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మంగళవారం బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, సభ్యత్వ జిల్లా ప్రభారి సుభాష్‌చందర్‌జీని కలిసి సన్మానించారు.

## తాళ్లకుంట చెరువును కాపాడాలి


ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొమురవెల్లి, అక్టోబరు 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలోని తాళ్లకుంట చెరువును కొంత మంది కబ్జాదారుల నుంచి కాపాడాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. దీంతో వెంటనే ప్రతాప్‌రెడ్డి ఇరిగేషన్ ఈఈతో మాట్లాడి తాళ్లకుంట చెరువును సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎఫ్‌టిఎల్ శిఖం పూర్తిగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువు కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని మల్లికార్జున్, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, మెరుగు శ్రీనివాస్, మల్లం బాలయ్య, మల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 8, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలోని మహిళ సిబ్బంది బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు

# హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**సిపిఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి**

**కొమురవెల్లి, అక్టోబరు 8, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్రిముచ్చల గ్రామంలో జరిగిన గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ ఏడాదికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల ఖాతాలో వేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణామాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.


మాట్లాడుతున్న మల్లారెడ్డి

రైతులకు అన్ని పంటలకు బోనస్ రూ.500 ప్రకటించాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేయాలన్నారు. గ్రామ కార్యదర్శులుగా బోడిగం సురేందర్‌రెడ్డి, దెబ్బెట బాలనర్సయ్య, పాచికంటి బాలరాజు, బోడిగం వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కల యాదవరెడ్డి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరు రవీందర్, దుర్గయ్య, సత్తయ్య, ఎల్లారెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, జయ, పద్మ, సునీత, లావణ్య, విగ్నేశ్వరీ, బాలయ్య, అల్లం యాదయ్య, చంద్రారెడ్డి, యాదిరెడ్డి, చిలుక కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యాసరస్వతి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపి రఘునందన్‌రావు

## శ్రీవిద్యాధరి క్షేత్రంలో ఎంపి రఘునందన్‌రావు పూజలు

**వర్గల్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** శ్రీవిద్యాధరి క్షేత్రంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మెదక్ ఎంపి రఘునందన్‌రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ చదువుల తల్లి శ్రీ విద్యాసరస్వతి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల ఇలవేల్పుగా ప్రసిద్ధికెక్కిందని తెలిపారు. అంతేకాకుండా భక్తుల సౌకర్యాలకు సైతం పెద్దపీట వేస్తూ ఆలయ కమిటీ ముందుకెళ్తుందని అన్నారు. క్షేత్రం వద్ద నిరంతరం వేద ఘోష, అన్న ప్రసాద వితరణ ప్రత్యేకతగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతినిత్యం క్షేత్రానికి వచ్చే వేలాది మంది భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న ఆలయ కమిటీని ఆయన ప్రశంసించారు. ఆయనవెంట రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గురువారెడ్డి, నాయకులు వెంకటరమణ, నందన్‌గౌడ్, వెంకట్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భూనిర్వాసిత రైతుల అభ్యంతరాలు స్వీకరణ : ఆర్డీవో


రైతు వేదికలో భూనిర్వాసిత రైతులతో చర్చిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతుల అవార్డు ఎంక్వైరీ కార్యక్రమం పూర్తయిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రైతు వేదికలో భూనిర్వాసిత రైతులతో విచారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డులో భూముల కోల్పోతున్న 17 గ్రామాల్లోని రైతులతో అవార్డు ఎంక్వైరీ నిర్వహించామన్నారు. ఈమేరకు శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి, రత్నాపూర్ గ్రామాలకు సంబంధించిన రైతులతో అవార్డు ఎంక్వైరీ కార్యక్రమం నేటితో పూర్తయిందన్నారు. సమావేశంలో భూనిర్వాసిత రైతులు ఇచ్చిన అభ్యంతరాలను స్వీకరించామని తెలిపారు. ఈ భూముల్లో అభ్యంతరాలపై ముందుగా రైతులకు సమాచారం అందించి మళ్లీ అభ్యంతరాలున్న భూములు రీసర్వే చేసి అభ్యంతరాలను పరిష్కరిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, భూనిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ లో బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు పూర్తి

**నర్సాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** పట్టణంలో గురువారం జరిగే బతుకమ్మ సంబరాల్లో బాగంగాలో బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని రాయరావుచెరువు వద్ద మహిళలకు వీలుగా బతుకమ్మలను విడిచిపెట్టడానికి అన్నివసతులు ఏర్పాట్లను చేశామని తెలిపారు. మంగళవారం నర్సాపూర్ రాయరావు చెరువులో బతుకమ్మ పండగ సంబరాలకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదేశాల మేరకు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివాలయంవద్ద, చిల్డ్రన్‌పార్కువద్ద, వినాయకనగర్ కాలనీ లో హన్మంతాపూర్‌లలో మహిళలు బతుకమ్మలను ఆడుకోవడానికి ఏర్పాట్లు చేయడం జరిగింది, ఈకార్యక్రమంలో శానిటెరి ఇన్స్‌పెక్టర్ సల్లమురళీ, వార్డు అధికారులు రాజు, ఆంజనేయులు, పరుశురామ్‌రెడ్డి, జవాన్, ఎల్లయ్య, అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.


రాయరావుచెరువు వద్ద బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు


శ్రీదుర్గామాత పూజల్లో పాల్గొన్న శ్రీరాజయోగి వెంకటస్వామి మహారాజ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ తదితరులు

## ఘనంగా శ్రీదుర్గామాతకు ప్రత్యేక పూజలు

**నర్సాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** శ్రీదుర్గా భవాని మాతా నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో హనుమాన్ ఆలయంలో ప్రతిష్టించిన శ్రీదూర్గమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుస్తుంపేట ఆత్మానందాశ్రమ పీఠాధిపతి శ్రీరాజయోగి వెంకటస్వామి మహారాజ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, ఓబిసి జిల్లా ఉపాధ్యక్షుడు గుండం శంకర్, గ్రామ మాజీ ససర్పంచ్ విజయబాస్కర్‌రాజు, మాజీ ఎంపిటీసి గుర్రాల అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్రాల మల్లేషం, బిజెపి గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొనగా ఆలయ పూజారి, హరిప్రసాద్‌శర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య శ్రీదుర్గామాతకు ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలను ఎల్లప్పుడు సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని వారు శ్రీదుర్గామాతను వేడుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఈ ప్రత్యేక పూజలకు హాజరైన వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

**నర్సాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలకు మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పంచాయతీ కార్మికుల కుటుంబాలకు దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం ప్రతినిత్యం ఎంతగానో శ్రమించే గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలకు దుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తులను అందించిన మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌గౌడ్, సురేందర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, నర్సింలు, రాజేశ్, రమేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 40 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

**నర్సాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన 40 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంఆర్‌ఎఫ్ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**బాధితులకు 3 లక్షల 50 వేల ఎల్‌వోసిలు అందజేత**

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న బాధితులకు టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు 3 లక్షల 50 వేల రూపాయిల ఎల్‌వోసి చెక్కులను అందజేశారు. హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన నాగరాణి కొంత కాలంగా అనారోగ్యానికి గురై హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున ఆమె చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 2 లక్షల 25 వేల రూపాయల ఎల్‌వోసిని, అదేవిదంగా నర్సాపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామానికిచెందిన సువర్ణ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నందున ఆమె చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 1 లక్షా 25 వేల రూపాయిల ఎల్‌వో సీని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌సుహాసినిరెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్‌లో దుర్గా హవనం హోమం

**కొల్చారం, అక్టోబరు 8 ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం జై దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపం వద్ద సాయి కిషోర్, అంకుశం పంతులు ఆధ్వర్యంలో దుర్గా హవనం హోమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ ధర్మపత్ని ప్రవళిక, రంగంపేట సీఈవో నవీన్ యాదవ్ ధర్మపత్మి శ్వేత, వడ్ల చంద్రశేఖర్ దంపతులు, కోళ్ల సత్యం దంపతులు, జుర్రు రాజు దంపతులు హోమంలో పాల్గొనడం జరిగింది. దుర్గా హవనం హోమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు సతీష్ సాయిరాజ్, మైపాల్, సాంబ, చిన్న దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు. దుర్గామాతా పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.

## అంతర్‌పంటల సాగుకు రైతులు ముందుకు రావాలి

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** అంతర పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని ఏవో శ్రీనాథ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి మామిండ్ల యాదగిరి తన పొలంలో కంది పంటలో అంతర పంటగా సాగు చేసిన రాగి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంతర పంటలను సాగు చేయడం వలన వర్షాభావ పరిస్థితుల్లో ఒక పంట నష్టపోయినా మరో పంట దిగుబడితో నష్టాన్ని తగ్గించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పవన్, రాజేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అందిస్తున్న సేవలు అభినందనీయమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద నిర్వహిస్తున్న అల్పాహార పంపిణీ కార్యక్రమం మంగళవారంతో 100 రోజులు పూర్తిచేసుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు, వారి బంధువులకు ప్రతిరోజు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేయడం హర్షణీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశంగౌడ్‌ను అభినందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, గోలి సంతోష్, నేతి శ్రీనివాస్, గుడాల రాధాకృష్ణ, సంజయ్‌గుప్త, మల్లేశంగౌడ్, పరమేశ్వర్‌చారి, రావికంటి చంద్రశేఖర్, టీచర్ సత్యనారాయణ, డాక్టర్ నర్సింలు, కుమారస్వామి, దొంతుల సత్యనారాయణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ఘనంగా ముగిసిన పుస్తక రహిత దినాలు



విద్యార్థినీ, విద్యార్థులతో నవోదయ విద్యాలయ అధ్యాపకులు

**వర్గల్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయలో ఈనెల 4వ తేదీన ప్రారంభమైన పుస్తక రహిత దినాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. విద్యార్థిని, విద్యార్థులు అందరూ ఎంతో ఉత్సాహంగా తమకు కేటాయించబడిన కృత్యాల్లో ఎంతో సంతోషంగా పాల్గొంటూ తమ సృజనాత్మకతను వెలికితీశారు. గార్డెనింగ్, పెయింటింగ్, మ్యూటిక్, డ్యాన్స్, తబలా, నర్సరీల్లో విద్యార్థులు దినమంతా నిమగ్నులై ఉత్సాహంగా పనిచేశారు. విద్యార్థులకు విద్యాలయ ప్రధానాచార్యులు దాసి రాజేందర్, ఉప ప్రధానాచార్యులు రమేష్ అంచురి, ఉపాధ్యాయ బృందం ఎప్పటి కప్పుడు తగు సూచనలు ఇస్తూ వారం రోజులు అన్ని కృత్యాలు దిగ్విజయంగా జరిగేలా చూశారు. ఈ బ్యాగ్‌లెస్ డేస్ తమలో ఎన్నో మధురస్మృతులను మిగిల్చాయని విద్యార్థులు ఈ సందర్భంగా తెలియజేశారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగున్నర గంటల వరకు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎం.సాయినాథ్‌రెడ్డి మోటివేషన్ స్పీచ్ ఇవ్వడం జరిగింది. నవోదయ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి గత స్మృతులను నెమరువేసుకున్నారు. నవోదయలో చదవడంవల్ల ప్రతి విద్యార్థికి సంపూర్ణ వికాసం లభిస్తుందని అన్నారు. ముఖ్యంగా సైన్స్‌గ్రూప్ చదివిన విద్యార్థులు తర్వాత ఏయే రంగాలలో ఏయే కోర్సులు చదివి విజయం సాధించవచ్చో వివరించారు.

## వికాస పిల్లలకు అండగా ఉంటా : మాజీ జెడ్‌పిటిసి

**జగదేవ్‌పూర్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** వికాస పిల్లలకు అండగా ఉంటానని మర్కుక్ మండల మాజీ జెడ్‌పిటిసి యెంబరి రామచంద్రం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలో ఎస్‌సివి రోస్ సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా నూతన దుస్తులను, దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ వికాస పిల్లలకు గత 17 సంవత్సరాల నుండి ప్రతి బతుకమ్మ, దసరా పండుగకు నూతన దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. తాను సంపాదించిన దానిలో కొంత సేవా కార్యక్రమాలకు ఖర్చుచేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని, అనాథ పిల్లలకు ఎప్పుడూ అండగా ఉంటానని అన్నారు. అనాథ పిల్లలు, వృద్ధుల కోసం నిరంతరం సేవ చేస్తున్న ఎస్‌సివి రోస్ సంస్థ సేవలు అభినందనీయమని అన్నారు. అదేవిధంగా అలిరాజపేట మాజీ సర్పంచ్ మొగిలి లక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సివి రోస్ సంస్థ డైరెక్టర్ సవిత, క్యాథలీన్, కో-ఆర్డినేటర్ శ్వేత, స్వాతి, ఫాదర్ అనిల్, సామాజిక కార్యకర్తలు కృష్ణమూర్తి, నర్సింలు, సలీమ్, సయ్యద్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడి టీచర్ల సేవలు అభినందనీయం

**మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్**


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, అధికారులు,

**నర్సాపూర్ అక్టోబరు 8, ప్రభాతవార్త:** అంగన్‌వాడి టీచర్లు మహిళలకు, పిల్లలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డివోడబ్ల్యూ బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద పోషణమాసం, బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో పోషణ మాసంకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడి టీచర్లు గర్భిణీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తు వారి అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం అశోక్‌గౌడ్ బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు అంగన్‌వాడి టీచర్లు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఇంచార్జీ సరళాకుమారి, అధికారులు, ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్ వైజర్‌లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## దుర్గా మాతను దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు

**వెల్దుర్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చండీ హోమం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు గీరశ్వరశర్మ వీరికి ఆహ్వా నం పలికారు. అనంతరం ఘనంగా జరిగిన చండీ హోమం పాల్గొన్నారు. దుర్గామాతను దర్శించుకొని భక్తులు, ప్రజలు చల్లగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

**సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత..**

మండల పరిధిలోని కొప్పులపల్లి గ్రామానికి చెందిన పద్మకు రూ.20 వేలు, శెట్టిపల్లి గ్రామానికి చెందిన పోచమ్మకు 40వేలు, సత్తయ్యకు రూ.38 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, గంగాధర్, శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, శంకర్‌గౌడ్, పీఏ సీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నంబూద్రి గుప్త తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర్లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

**సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం**

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కుమ్మర్లు రాజకీయంగా, ఆర్థికంగా విద్యపరంగా ఎంతో వెనకబడి ఉన్నారని ఆయా రంగాల్లో ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారత కులాల కుంబార్(కుమ్మరి) ప్రజాపతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం అఖిల భారత కులాల కుంబార్(కుమ్మరి) ప్రజాపతి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కుమ్మర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మర్లకు సముచిత స్థానం కేటాంచాలన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ కుమ్మర్లకు న్యాయం చేయాలన్నారు. కుమ్మర్ల సంఘాన్ని మరింత పటిష్టం చేయడంతో పాతు హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. సంఘం ప్రతినిధి వేలాద్రి మాట్లాడుతూ కుమ్మర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు.


మాట్లాడుతున్న కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రం

కుమ్మర్లను బిసి బి నుంచి బిసి ఏలోకి మార్చాలన్నారు. అనంతరం సమావేశంలో సంఘం ప్రతినిధులు కుమ్మరి వృత్తిదారులకు, కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కవయిత్రిమొల్ల వర కవి సిద్దప్ప, జస్టిస్ కుమారయ్య లాంటి మేధావుల విగ్రహాలను ప్రధాన కూడలల్లో ప్రతిష్టించాలని, కుమ్మర్లు మట్టిపాత్రలను అమ్ముకోవడానికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని పలు తీర్మాణాలు చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు చాతరాజు సత్యం, అంజనేయులు, రాదారి నాగరాజు, దరిపల్లి నగేష్, దరిపల్లి శ్రీనివాస్, వాసరవేని పర్శరాములు, సుదర్శన్, మహేందర్, రఘుపతి, బాలరాజు, సత్తయ్య, భాను, రాములు, భానుచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌ను అరెస్టుచేయాలని డిఎస్‌పికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

## ఆనంద్‌ను అరెస్టు చేయాలి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఘూజియాబాద్‌కు చెందిన యతి నార్సింగ్ అనంద్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎంఐఎం అధ్యక్షులు మోహీద్ పటేల్ డిఎస్‌పికి మంగళవారం వినతి పత్రం అందచేశారు. సోమవారం పట్టణంలోని డిఎస్‌పి కార్యాయంలో ఎంఐఎం నాయకులతో కలిసి మోహీద్ పటేల్ వినతి పత్రం అందచేసిన సందర్భంగా స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ బెయిల్‌పై ఉన్న ఆనంద్‌ను వెంటనే బెయిల్‌ను రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భారత దేశం ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉంటున్నారని, యతి నార్సింగ్ ఆనంద్ లాంటి వ్యక్తులు ప్రజల, మతాల మధ్య చిచ్చు పెట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రధాన మంత్రి ఖండించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ సర్పంచ్ నజీబ్, ఎంఐఎం నాయకులు మజహర్, జబర్, ముక్తార్, అంబెడ్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన వైస్ చైర్మన్



బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని మంగల్‌పేట్‌లో 2,3వ వార్డులలో బతుకమ్మ ఉత్సవాల కోసం డిఎస్‌పి కార్యాలయ సమీపంలో ప్రశాంతంగా, ఘనంగా జరుపుకునేలా చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పరిశీలించారు. అలాగే గోతులు పడిన ప్రాంతాల్లో మొరం వేయించి చదును చేయిస్తున్నారు. విద్యుత్ లైట్లు ఏర్పాట్లు చేయిస్తామని వైస్ చైర్మన్ శంకర్ పేర్కొన్నారు. బతుకమ్మలను వేడుకల అనంతరం నిమజ్జనం చేసేందుకు నీటి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తున్నామన్నారు. బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ముగిసేలా ప్రతి ఒక్కరు సహకరించాలని దారం శంకర్ ప్రజలకు కోరారు.

## దుర్గమ్మకు లక్షపుష్పార్చన పూజలు



లక్ష పుష్పార్చన పూజలో పాల్గొన్న మహిళామణులు

**పాపన్నపేట, అక్టోబరు 8, ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని కొడుపాకలో ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మిదేవిగా అలంకరించి తొగుట రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాల్లో 251 మంది మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దిమ్మయ్యగారి వేణుగోపాల్, శ్రీనివాస్ దంపతుల సమక్షంలో అర్చకులు రామశర్మ కనుసన్నల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## ఆర్‌టిఐ మండల అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డికి నియామకపత్రం అందచేస్తున్న ప్రవీణ్‌కుమార్

**రామచంద్రాపురం, అక్టోబరు 8, ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం యాక్టివిటీ సొసైటీ రామచంద్రాపురం మండల అధ్యక్షులుగా మనోహర్ రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మనోహర్‌రెడ్డికి నియామక పత్రం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలో సమాచార హక్కు చట్టం 2005 ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించి సమాచార హక్కు చట్టం బలోపేతం అయ్యేలా చేస్తానని మనోహర్‌రెడ్డి హామీ చేశారు. తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా ఆర్‌టిఐ కార్యవర్గాలకు మనోహర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

### -పాల్గొని పూజలు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**పాపన్నపేట, అక్టోబరు 8 ప్రభాతవార్త :** తెలంగాణలో అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానిమాత సన్నిధిలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అమ్మవారిని అర్చకులు పార్థివశర్మ, రాజశేఖర్‌శర్మ,శంకరశర్మ దుర్గామాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకుల్ షెడ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ మండపం నుంచి భక్తులు బోనాలు తీసుకుని రాజ గోపురం వద్దకు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా చేసుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి దంపతులు హజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. వేడుక ల్లో ఇఒ చంద్రశేఖర్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్మరి జగన్, ఆలయ మాజీ చైర్మన్ బాలగౌడ్, మాజీ ఎంపిపి పుల్లన్నగారి చందన ప్రశాంత్‌రెడ్డి, గంగారెడ్డి, మెదక్ మున్సి పల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, యాదాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలే దీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

దుర్గామాతకు బోనాలు ఊరేగిస్తున్న భక్తులు



# ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

**గజ్వేల్, అక్టోబరు 8 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామ శివారులో ఉన్న సర్వేనెం.323లోని 4.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిపై అధికారులు దృష్టి సారించాలని మంగళవారం శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన పలు కుల సంఘాల నాయకులు గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 3 వేల పైచిలుకు జనాభా కలిగి ఉందని, అన్ని కులాల వారు ఉన్నప్పటికీ కుల సంఘ భవనాలు, కమ్యూనిటీ హాల్‌లు లేవని, వాటి కోసం కేటాయించడానికి స్థలాలు లేవని, సర్వే నెం.323 లో ఉన్న ప్రభుత్వ భూమి 4.20 ఎకరాలలో కేటాయిస్తే కమ్యూనిటీహాల్ నిర్మించుకోవడానికి అనుకూలంగా ఉంటుందని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే ఆ భూమిని ఇతరులకు కేటాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, మా భూమిని ఎవరికి కేటాయించినా చూస్తూ ఊరుకోమని, మా గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ భూమి మా గ్రామస్తులకే ఉండాలని పేర్కొన్నారు. అన్నికులాలకు ప్రభుత్వం దృష్టిసారించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు శ్రీగిరిపల్లి గ్రామంలో ఉన్న చెరువు, కుంటలను ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లను గుర్తించి అద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. గతంలో రెండుసార్లు ఈ భూమి విషయంపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినా స్పందనలేదని, ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కె.అమరేందర్‌రెడ్డి, కుమారస్వామి, వెంకటనర్సింహారెడ్డి, చిమ్మిరెడ్డి, పాండవుల శ్రీనివాస్, చిత్ర ఆర్ట్ నర్సింలు, పొట్ట మల్లేశం, రాజు, బాలయ్య, రాములు, ఎస్.వెంకటేష్, ఎండి.జహంగీర్ పాల్గొన్నారు.

### ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన శ్రీగిరిపల్లి గ్రామస్థులు



ఆర్డీవో బన్సిలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సంతోష్‌రావు, మల్లేశం

## కోనాపూర్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభం

**కొల్చారం, అక్టోబరు 8 ప్రభాతవార్త:** శరీర ధారుడ్యానికి, మానసిక ప్రశాంతతకు క్రీడలు ఎంతో దోహదపడతాయని బీఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, మాజీ సర్పంచి మోత్కు మల్లేశం, వెంకటేశంగుప్తా, రమేష్ అన్నారు. మంగళవారం కొల్చారం మండలం కోనాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ యువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోషరావు, మోత్కు మల్లేశం సౌజన్యంతో కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను సంతోష్‌రావు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విజయ దశమి పండగకు ముందు కబడ్డీ పోటీలను నిర్వహిస్తామన్నారు. పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుందని చెప్పారు. మొత్తం పోటీల్లో 6 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. మొదటి విజేత జట్టుకు రూ.12000 నగదు పారితోషకం, ద్వితీయ విజేత జట్టుకు రూ.6000 రూపాయల నగదు పారితోషికం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నగదు పారితోషికం సంతోష్‌రావు సౌజన్యంతో అలాగే విజతేలకు ట్రోఫీల పంపిణీ కార్యక్రమానికి మోత్కు మల్లేశం స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునితా రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు సంతోష్‌రావు, మల్లేశంలు తెలిపారు.

## ఘనంగా అట్ల బతుకమ్మ

**కొల్చారం, అక్టోబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక.. తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చిన మహిళలు సాయంత్రం బతుకమ్మ ఆటపాటలతో గంగమ్మ వడికి చేరుస్తారు. మంగళవారం అట్ల బతుకమ్మ కావడంతో మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని శివాలయంతో పాటు వీరభద్ర ఆలయ సమీపంలో మహిళలు పెద్దఎత్తున బతుకమ్మ పాటలు పాడుతూ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

## భక్తి శ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**మెహిదీపట్నం, అక్టోబరు 8, ప్రభాతవార్త :** కార్వాన్‌లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్దలతో కొనసాగు తున్నాయి. మండపాలలో కొలువుదీరిన అమ్మవార్లకు స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటు న్నారు. గుడిమల్కాపూర్ డివిజన్ బాలాజీనగర్‌లో కొలువుదీరిన అమ్మవారిని ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అడికి మల్లిఖార్జున్, సామ సురేందర్‌రెడ్డి, రామ్‌రెడ్డి,వెంకట్‌రావు,రమణ,సంతోష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు హర్షణీయం

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** ఒకేక్యాంపస్‌లో ఎస్సీ,ఎస్టీ,బిసి మైనార్టీ విద్యార్థుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని బిసి సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ అన్నారు.ఈమేరకు మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో సుమారు 5వేలకోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభిస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒకస్కూల్ ఒక్కో స్కూల్‌కు 25కోట్లు కేటాయించడం 7 నెలల్లో దాన్ని పూర్తిచేస్తామని ప్రకటించడం దేశానికే ఆదర్శమన్నారు. బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడాన్ని బిసి సంఘాలుగా స్వాగతిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కోలాజనార్ధన్, నిరుద్యోగ జేసీసీ చైరనమన్ నీలవెంకటేష్, ప్రధాన కార్యదర్శి నందగోపాల్, వేముల రామకృష్ణ పాల్గొన్నారు.

## మంగళగౌరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు మంగళగౌరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అయం ఈవో మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ నేతృత్వంలో జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు చేశారు. కాగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంతో దర్శనమిస్తారు.

## మహంకాళి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

**హైదరాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** అంబర్‌పేటలోని మహం కాళి అమ్మవారి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో మంగళవారం రాజ్యస భ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన సేవాసమితి నాయకులు అనిల్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, ఛీఫ్ అడ్వైజర్ కే.దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్య క్షులు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజు, బింది మల్లి కార్జున్‌గౌడ్, సుధాకర్, దామకొండ కిషోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, పంజాల గిరిధర్‌గౌడ్, బింది శశికాంత్‌గౌడ్, గడ్డం సునీల్‌గౌడ్, పం జాల వెంకటేష్‌గౌడ్, ఈ.రాకేష్, ఆర్.సుధాకర్ పాల్గొన్నారు.

## మూసీ పరివాహక ప్రజలకు ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** మూసీ పరీవాహక ప్రాంత నిర్వాసితులైన పేద ప్రజలకు వెంటనే ఇళ్లు ఇచ్చి ఆదుకోవా లని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలతో ఆడుకుంటోందని ఆరోపించారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య మూడు లక్షలకు పైగా ఉన్నా, కొత్త పెన్షన్‌ల ఊసే ఎత్తటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగులకు, వితంతువులకు పెన్షన్‌లు ఇవ్వలేని ప్రభుత్వం మూసీ నదిని అభివృద్ధి చేస్తామంటూ లక్షన్నర కోట్లతో కొత్త కుంభకోణానికి తెరతీస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళ లకు ఇస్తామన్న 2,500 ఏం చేశారో తెలియదు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీ రియంబర్స్‌మెంట్ లేక వారి భవిష్యత్ అగమ్య గోచరంగా తయారయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనాడూ ప్రజా సంక్షేమం కోసం పనిచేయని కాంగ్రెస్ పార్టీ డ్రామాలన్నీ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యద ర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, రవీంద్రాచారి, శ్రీనివాస్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే

**బేగంపేట,అక్టోబర్ 8 (ప్రభాతవార్త):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బేగంపేట శ్రీ కట్టమైస మ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీ భువనేశ్వరీ దేవి అలంకా రంలో ఉన్న అమ్మవారిని మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధ వరం క్రిష్ణారావు, మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తాగిడి లక్ష్మారెడ్డిలు బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరీ శ్రీహరితో కలసి దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆలయ ఈవో వంగా అంబుజ, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ చక్కల సుభాష్ ముదిరాజ్‌లు ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఎమ్మెల్యేతో పూజలు నిర్వహింపజేశారు.వేద పండితులు ఆశీర్వచ నం అందజేసి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరితో పాటు నాయకులు పొన్నబోయిన సురేష్‌యాదవ్, శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తలసాని సహకారంతో లీలానగర్ ఎంతో అభివృద్ధి

### : మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో లీలానగర్ ఎం తో అభివృద్ధి చెందిందని మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అన్నారు. మంగళవారం శేషుకుమారి స్థానికులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెఆర్ నగర్ నుండి లీలానగర్ వరకు బేగంపేట రైల్వే స్టేషన్ దరిదాపు వరకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవవ్ మంత్రిగా ఉన్న సమ యంలో గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులకు కొరకు శాంక్షన్ అయినా, ఎలక్షన్ కోడ్ రావడంతో పనులను ఆపవలసి వచ్చిందని ఇప్పుడు మొదలుపెట్టినట్లు తెలిపారు. లీలానగర్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసినందుకు ఈ సందర్భంగా ఆమె లీలానగర్ వాసుల తరపున ఎమ్మెల్యే తలసానికి కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎం.హనుమంతరావు, కూతురు నరసింహ, కట్ట బలరాం, ఉత్తం రాజ్ పురోహిత్, మహిళా నాయకురాలు లీలానగర్ వాసులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు రావల్సిందిగా మంత్రులకు ఆహ్వానం

**ముషీరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:**

కట్ట మైసమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావల్సిందిగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను ఆహ్వానించారు. మంగళవారం దేవాలయ ఛైర్మన్ గౌతం కుమార్ పటేల్, ఆలయ కార్యనిర్వహణాధికారి కే.సాంబశివరావు, ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మలు మంత్రుల కార్యాలయాలలో మంత్రులను కలిసి ఆహ్వాన పత్రికలు అందచేశారు.



పూజలో పాల్గొన్న ఎం.భూపాల్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

## జ్వాలాముఖిని దర్శించుకున్న నాయకులు

**కంగ్టి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** మండలంలోని తడ్కల్ ఎడ్లరేగడి తండాలో మంగళవారం జ్వాలా ముఖి వార్షికోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. జ్వాలాముఖి కాళ్లబాబా, రాంసింగ్ బాబామాన్‌సింగ్ బాబాలు ప్రతి సంవత్సరం మందిరం వద్ద వార్షికోత్సవ వేడుకలు మథురా లంబాడీలు తమ దైవ భక్తిని చాటుకుంటారు. అదే విధంగా ప్రతిసారి సెప్టెంబర్ మాసం తోలి అమావాస్య తొలి సోమవారం నుంచి బుధవారం వరకు ఈ వార్షికోత్సవ, జాతర మూడు రోజులపాటు భక్తులు భక్తిని చాటుతారు ప్రతి లంబడీ గుడాల నుంచి ఇక్కడకు చేరుకుని సంప్రదాయం ప్రకారం వివిధ కార్యక్రమాలు చేపడుతుంటారు. ఈ మహోత్సవ జాతరకు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్య ప్రదేశ్, తెలంగాణకు చేరుకుని దైవదర్శనం చేసుకుంటారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని పండుగలు నిర్వహించడం సంతోషాన్ని ఇస్తాయని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాలాముఖి పీఠాధిపతి మంగళ్‌చంద్ మహారాజ్, బోర్గి రాసోల్, భక్తులతో ఇక్కడి కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. మూడు రోజులపాటు నిత్యం అన్నదాన ప్రసాదం నిర్వహిస్తామని పూజారి జవహర్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## లలితా త్రిపురా సుందరిదేవిగా అమ్మవారు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 8, ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవి అమ్మవారు లలితా త్రిపురా సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. దేవి దీక్ష తీసుకునన భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## చాముండేశ్వరి దేవిగా అమ్మవారి దర్శనం

**ఝరాసంగం, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వర ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని చాముండేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్ధ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

## ఫ్యాషన్ డిజైనింగ్‌పై అవగాహన

**చౌటకూరు, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫ్యాషన్ డిజైనింగ్‌పై అవగాహనతోపాటు శిక్షణ అందిస్తున్నారు. ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్త సూచనల మేరకు మంగళవారం వృత్తి విద్యాలో భాగంగా ఫ్యాషన్ డిజైనింగ్‌లో 10 రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు పి.వీణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గోంగ్లూర్‌లోని అనిత శిక్షణ కేంద్రంలో ఫ్యాషన్ డిజైనింగ్‌కు సంబంధించిన మేళకువలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో ప్రావీణ్యం పొందితే విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడే అవకాశాలు మెండుగా ఉంటాయని వివరించారు.

## హర్యానాలో బిజెపి అధికారంలోకి రావడం పట్ల హర్షం



బిజెపి మండల అధ్యక్షులు కోణం విఠల్

**పెద్దశంకరంపేట, అక్టోబరు 8 ప్రభాతవార్త:** హర్యానా రాష్ట్రంలో వరుసగా మూడవసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం పట్ల పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, నాయకులు బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు

**కొల్చారం, అక్టోబరు 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో మంగళవారం మెదక్–హైదరాబాద్ ప్రధానరహదారి(765) నుండి గ్రామంలోకి వెళ్లే రోడ్డులో కాంగ్రెస్ నాయకులు, అప్పాజిపల్లి మాజీ సర్పంచి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు నాయిని సునీత వెంకట్‌గౌడ్ గజిని సొంత డబ్బులు రూ. 30 వేలతో వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోతంశెట్టిపల్లి మాజీ సర్పంచి గడ్డమీది నాగరాణి నర్సింలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డమీది రాములు, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ పుల్లబోయిన పోచయ్య, కొమ్ముల రాజుగౌడ్, పుల్లబోయిన దుర్గేష్, బ్రహ్మండ్లపల్లి సత్యనారాయణ, యాదగిరిగౌడ్, మహేష్, వడ్ల భానుచందర్, గడ్డమీది శ్రీను, మంగలి విజయ్, నాయికోటి ప్రవీణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ మెనింజైనిస్ దినోత్సవం

**చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** ప్రమాదకరమైన వ్యాధుల పిల్లలను తమ తల్లిదండ్రులు కాపాడుకోవాలని ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు, డాక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. వ్యాక్సిన్ ద్వారా నివారించగల ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగి ఉంటుందని, పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మంగళవారం ప్రపంచ మెనింజైనిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మెనింజైటిస్ వ్యాధి పట్ల అవగాహన అవసరమని, ఈ వ్యాధిని నిర్మూలించడానికి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్ళడం, సమస్యను ముందుగా గుర్తించడం, టీకా ద్వారా వ్యాధిని నివారించడం, తద్వారా ప్రాణాలను రక్షించే సామర్థ్యాన్ని ప్రోత్సహించడం కోసం కార్యక్రమం నిర్వహించడం విశేషమన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 2.5మిలియన్లకుపైగా మెనింజైటిస్ కేసులు నమోదవుతున్నాయని, ఇది తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాఎన్ని సూచిస్తోందని, ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో దాదాపు డెబ్బై శాతం మంది ఐదు సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు అని అన్నారు. ఈ వ్యాధి మెదడు, వెన్నుపాము చుట్టూ రక్షిత పొరల వాపు, సాధారణంగా బ్యాక్టీరియా, ఫంగల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధిబారిన పడ్డ దేశాలలో భారతదేశం మొదటి మూడు దేశాలలో ఉందని, అక్యూట్ బాక్టీరియల్ మెనింజైటిస్‌కు కారణమయ్యే మూడు వ్యాధికారకాలలో నీసేరియా, మెనింజైటిడిస్ ఒకటన్నారు. ఈ ప్రాణాంతక వ్యాధిని ఎదుర్కోవడానికి, ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపీ) మెనింగోకాకల్ వ్యాక్సిన్ ఇవ్వాలని, ఫలితంగా ప్రమాదం ఎక్కువగా ఉన్న 2 సంవత్సరాలకంటే ఎక్కువ వయస్సు వారికి ఒక డోస్‌గా సిఫార్సు చేయబడుతుందన్నారు.

## ఆబ్కారీ భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేకంగా వచ్చే పండగ బతుకమ్మ.. తొమ్మిది రోజులపాటు పసుపు గౌరమ్మను పూజించి తీరొక్కపూలతో తయారుచేసిన బతుకమ్మ చుట్టూ ఆడిపాడతారు. ఈనేపథ్యంలో మంగళవారం నాంపల్లిలోని ఎక్సైజ్ భవన్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ కృష్ణప్రియ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ బతుకమ్మ, దాండియా ఆడి అలరించారు. ఈకార్యక్రమంలో కె.విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై ఉత్కంఠ

### రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఆందోళన.. పల్లెల్లో ఎక్కడ చూసిన ఎన్నికల చర్చలు

**కల్హేర్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి అనేది ఆయా గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒక వేళ పంచాయతీ ఎన్నికలు జరిగితే పాత రిజర్వేషన్‌ని కొనసాగిస్తారా లేక నూతన విధానాన్ని అవలంభిస్తారా అనేది పల్లెల్లో ఎక్కడ చూసినా జోరుగా చర్చలు జరుగుతున్నాయి. పంచాయతీ పదవులపై కన్నేసిన ఆశావాహులు ఓ వైపు రిజర్వేషన్ కలిసి వస్తుందో లేదోనని ఆందోళన పడుతూనే వర్తించకపోతే ఏమి చేయాలని తర్జన భర్జనలు పడుతున్నారు. కొందరు ఆసక్తి గల నేతలు తమ అనుచరులతో ఎన్నికలపై సమరాలోచన జరుపుతున్నారు. మాజీ ప్రజా ప్రతినిధులు సైతం తమ హయాంలో చేసిన అభివృదిద్ధ పనులు బిల్లులు రావాల్సి ఉన్నా.. వచ్చే ఎన్నికల్లో తమ ఉనికి చాటుకునేందుకు అవసరమైన వ్యూహ ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమలులో ఉండేలా గత ఎన్నికల సమయంలో చట్టాన్ని రూపొందించింది. ఆ చట్టం ప్రకారం పాత రిజర్వేషన్లను కొనసాగించాల్సి ఉంటుంది కానీ ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం అఖండ విజయంతో అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని సర్కార్ కొత్త విధానం అమలు చేసి తమ మార్క్ చేపెట్టుకుంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అదే కానక జరిగితే పాత రిజర్వేషన్ల చట్టాన్ని రద్దు చేసి కొత్త విధానం రూపొందించాల్సి ఉంటుందని ఏ పద్దతిని అమలు చేస్తారని ఉత్కంఠ ఆశావాహుల్లో నెలకొంది. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఒకే పోలింగ్ బూతులో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడటంతో పాటు ప్రభుత్వం ప్రస్తుతం ఓటరు జాబితా ప్రచురించింది. మండలంలోని మొత్తం 224 వార్డు మెంబర్లు 26 పంచాయతీ ఉన్నాయి.

ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన నిజాంపేట మండలంతో పాటు మరి కొన్ని గిరిజన తండాలు కూడా నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఏది ఏమైనప్పటికీ గ్రామపంచాయతీ ఎలక్షన్ ఎప్పుడు వస్తాయి.. నూతన ప్రభుత్వంలో రిజర్వేషన్లు ఎలా ఉంటాయి అని సర్పంచ్ పదవి కోసం పోటీలో నిలబడే నాయకులు, ఆశావాహులు ఆందోళనలో ఉన్నారు.